క్లుప్తంగా

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు 30 ఫిర్యాదులు



వినతులను స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 ఫిర్యాదులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. ఫోన్‌లో 17 మంది, 13 మంది నేరుగా సమస్యలను నివేదించారు. ఆయా సమస్యలను సంబంధిత విభాగాల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవం..నూతన కార్యవర్గం

చంద్రగిరి: విశ్రాంత ఉద్యోగుల చంద్రగిరి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా గురుమూర్తి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోడిరెడ్డి నరసింహా రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా మునిరెడ్డి, జయప్రసాద్, ఉపాధ్యక్షులుగా నాగమణి, గురుమూర్తి, చిరంజీవులు నాయుడు, మునికృష్ణయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రశేఖర్ నాయుడు, సభ్యులుగా రెడ్డప్ప, ఆంజనేయులు, రాజశేఖర్, కోశాధికారిగా పట్టాభిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూనె దుకాణాల్లో తనిఖీలు

తిరుపతి అర్బన్: నాణ్యమైన ఆయిల్ కంపెనీలకు చెందిన నూనె ప్యాకెట్లు మాత్రమే దుకాణదారులు విక్రయించాలని జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు హితవు పలికారు. తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని ఆయిల్ హోల్ సేల్ దుకాణం, బైరాగిపట్టెడలోని బేకరీ స్వీట్ దుకాణంలో తనిఖీలు చేశారు. వాటి నుంచి ఆరు శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపారు. తిరుపతి ఆయిల్ విక్రయాలపై, దుకాణాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి, జగదీష్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సహకారం



చంద్రగిరి: తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ విధి విధానాలపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గౌరీ శంకర్ రావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. స్కౌట్ అండ్ గైడ్స్ సంస్థను ముందుకు తీసుకెళ్లడానికి సమగ్ర శిక్ష ద్వారా పూర్తి సహాయ సహకారాలు, నిధులు సమకూర్చడానికి ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. జిల్లా ట్రైనింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి కార్యదర్శి విజయకు మార్, జయరామ్, స్కౌట్స్ మాస్టర్లు పి. మునిరత్నం, వెంకటేశులు, సహాయ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

తిరుపతి తుడా: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఫార్మసీ, పారామెడికల్, రేడియోగ్రాఫర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల పోరాట కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు రెడ్డి గంగరాజు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. వంద శాతం గ్రాస్ శాలరీ అమలు చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినప్పటికీ, ఇంకా అమలు చేయలేదని,కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆయన కోరారు.నళిని, గుణవతి, రాధ, అశోక్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలు, 17 మందికి జరిమానా

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో నిర్లక్ష్యంగా ఆటో నడుపుతున్న కేసులో తిరుపతి, నెహ్రూ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కాశీకి మూడు రోజులు జైలు శిక్ష , పది వేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ మనోహర్ ఆచారి పర్యవేక్షణలో నగరంలో తనిఖీలు నిర్వహించినట్టు కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపారు. స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసుల్లో 17 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నిరుపేదలను గుర్తించండి

తిరుపతి రూరల్: మండలంలోని గ్రామాల్లో అత్యంత నిరుపేదలను గుర్తించి, వారి వివరాలు సేకరించి, సచివాలయ సిబ్బందికి అందజేయాలని ఎంపీడీఓ రామచంద్ర సంఘమిత్రలను ఆదేశించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో పీ–4 సమావేశం నిర్వహించారు. ఆయనతోపాటు వయోజన విద్యాధికారిణి శైలజ, ఎంఈఓలు రఫీ మహమ్మద్, శంకరయ్య వివిధ అంశాలపై మాట్లాడారు. ఏపీఎం, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

నమ్మకద్రోహం.. బాబు నైజం..!



తిరుపతి మంగళం: మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చంద్రగిరి: పార్టీ నాయకులతో కలిసి క్యూ ఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- అధికారం కోసం అబద్ధపు హామీలు
- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ధ్వజం
- ప్రతి గ్రామంలోనూ బాబు మోసపూరిత హామీలపై రీకాల్ చంద్రబాబు

తిరుపతి మంగళం/చంద్రగిరి : తాము అధికారంలోకి వస్తే జగన్‌కంటే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక ప్రజలకు నమ్మకద్రోహం చేశారని చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదైనా ఇచ్చిన హామీల నెరవేర్చక, డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు..! ఇప్పటికే బాబు నైజమేమిటో ప్రజలకు తేటతెల్లమై కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సోమవారం తిరుపతిరూరల్ మండలం తిరుమలనగర్ పంచాయతీ హరిత కాలనీ, చంద్రగిరిలోని ఒక కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'..'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి అధికారం కోసం హామీలతో తమను నిలువునా దగా చేశారని ప్రజలు మండిపడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నారా లోకేష్ విరచిత 'రెడ్ బుక్' స్వీయ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో వారి దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. లిక్కర్ స్కాం పేరుతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టు చేసి వేధిస్తున్నారని ఉదహరించారు. అంతేకాకుండా తొలి నుంచి ఒక పథకం ప్రకారం తప్పుడు ప్రచారాలు సైతం చేస్తున్నారని, కూటమి పార్టీలోని కొంత మంది నేతలతో పాటు ఎమ్మెల్యే నాని అడ్డగోలుగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఈ తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి క్యూ ఆర్ కోడ్‌లను ఆవిష్కరించారు. దీనిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజల సెల్‌ఫోన్లలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, బాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేయించాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, యశోదమ్మ, పార్టీ రాష్ట్ర బీసీ విభాగం సహాయ కార్యదర్శి చిలమంద మునికృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు మునీశ్వరరెడ్డి, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షులు గుండ్రాజు శివశంకర్‌రాజు, జిల్లా పార్టీ నాయకులు నారాయణరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రచార విభాగం అధ్యక్షులు తుంటి సుధాయాదవ్, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మల్లెమొగ్గల ఉమాపతి, రాష్ట్ర పార్టీ మేధావుల విభాగం కార్యదర్శి అవిలాల లోకనాథరెడ్డి, ఆర్‌టీఐ అధ్యక్షులు మల్లారపు శ్రీ రాములు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తిరుపతి మంగళం: హాజరైన స్థానికులు

ఆగని శెట్టిపల్లె భూ పోరాటం..!



తుడా కార్యాలయం ఎదుట ఆందోళన నేతలు, బాధితులు

తిరుపతి తుడా: శెట్టిపల్లె భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుడా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. వామపక్షాల నాయకులు, రైతులు, కొనుగోలుదారులు నినాదాలతో హోరెత్తించారు. కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వ శెట్టిపల్లె భూములకు పరిష్కారం చూపకపోవడం శోచనీయమని, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులతో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం శెట్టిపల్లె భూములు కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయని, ఇప్పటికీ తుడాకు బదిలీ కాలేదని స్పష్టం చేశారు. త్వరలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్‌లో శెట్టిపల్లె భూముల వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని, ఈ భూములు తుడాకు బదిలీ అయిన వెంటనే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకు తెరపడింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, శెట్టిపల్లె భూపోరాట కమిటీ కన్వీనర్ రాధాకృష్ణ, సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వసతి పెంపుపై అధికారుల నిర్ణయమెప్పుడో..?



కళాశాల ప్రవేశాలు, హాస్టల్ సీట్లకోసం పడిగాపులు కాస్తున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు

తిరుపతి సిటీ: టీటీడీ జూనియర్ కళాశాలల్లో హాస్టల్ సీట్లు పెంచేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. హాస్టల్ సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని 20రోజుల క్రితం ప్రత్యేక ఫైల్ టీటీడీ ఉన్నతాధికారులకు చేరింది. పద్మావతి, ఎస్వీ జూనియర్ కళాశాలల్లో అదనంగా 200 సీట్లు పెంచాలని ప్రతిపాదనలు రాగా అధికారులు 100 సీట్లు పెంచేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే, జూనియర్ కళాశాలల్లో సీట్లు పెంచిన పక్షంలో డిగ్రీ కళాశాలలోనూ హాస్టల్ వసతి పెంచాల్సి ఉంటుందనే దానిపై అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. త్వరలో తుది నిర్ణయం వెలువడుతుందని విశ్వసనీయ సమాచారం.

సీట్లకోసం పడిగాపులు

పద్మావతి, ఎస్వీ జూనియర్ కళాశాలల ఆవరణలో రాయలసీమ జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థినులు, తల్లిదండ్రులు 20 రోజులుగా కళాశాల, హాస్టల్ సీట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు మార్కులు తక్కువగా ఉండడంతో కళాశాలలో సీట్లు లభించలేదు. దీంతో ఏదో ఒక గ్రూప్‌లో మిగిలిన సీట్‌లెనా ఇవ్వక పోతారా; అనే ఆశతో కళాశాల వద్ద నిరీక్షిస్తున్నారు. హాస్టల్ సీట్ల పెంపుపై నిర్ణయం టీటీడీ అధికారులు నిర్ణయం తీసుకుని తమ పిల్లలకు మేలు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు హాస్టల్ వసతి ప్లీజ్..!

–టీటీడీ ఈఓకు వినతి

తిరుపతి అన్నమయ్య సర్కిల్: సుదూర ప్రాంతాల నుంచి టీటీడీ జూనియర్ కళాశాలల్లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని దళిత విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావుకు వినతి పత్రం ఇచ్చారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటాలు ఉధృతం

–ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ పిలుపు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న

తిరుపతి సిటీ: విద్యారంగ పరిరక్షణకు విద్యార్థులు పోరాటం ఉధృతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఓ ప్రైవేటు పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే సంస్కరణలను అమలు చేయడం బాధాకరమన్నారు. డిగ్రీ, పీజీ అడ్మిషన్లకు ఇప్పటివరకూ పూనుకోకపోవడం శోచనీయమని, కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు దుర్భర స్థితిలో ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, తేజ, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, సహాయ కార్యదర్శి ఉమేష్ , జిల్లా నాయకులు నరసన్న, శివ, శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

లింగన్న చెరువు సప్లైచానల్ ఆక్రమణలపై ఫిర్యాదు



ఆక్రమణకు గురైన సప్లై చానల్

పాకాల: మండంలోని దామలచెరువు లింగన్న చెరువు సప్లై చానల్‌కు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాటూరు మోహన్ సోమవారం స్థానిక తహసీల్దార్ సంతోషసాయికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, సర్వే నంబర్ 1810–ఏలో లింగన్న చెరువు 13.88 సెంట్ల విస్తీర్ణంలో ఉండేదని, సప్లై చానల్ ఆక్రమించి అక్రమ కట్టడాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని, ఆక్రమణల మూలాన 15 ఏళ్లుగా చెరువుకు వర్షపు నీరు చేరడం లేదని నివేదించారు.

రాజకీయ కక్షతో తొలగించారు

రామచంద్రాపురం: తాను వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే నెపంతో కూటమి ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లతో తనను విధుల నుంచి తొలగించారని, తనకు న్యాయం చేయాలని ఓ బాధితుడు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చాడు. బాధితుడి కథనం.. మండలంలోని చల్లావారిపల్లెకు చెందిన ప్రతాప్, వెంకట్రామాపురం సబ్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ట్రాన్స్‌కో అధికారులు తనను విధుల నుంచి తొలగించారని, తనపై రాజకీయ కక్షతో స్థానిక కూటమి నేతలు నిరాధారమైన ఆరోపణలు చేయడంతో విధుల నుంచి తొలగించారని, దీనిపై నెల క్రితం కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చినా ఇప్పటివరకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడుతో పాటు విద్యుత్ కార్మిక సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్, తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, ట్రెజరర్ ఏ. రాజు, పుత్తూరు డివిజన్ నాయకులు మునిరామ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు





తిరుమల ఆలయం వెలుపల సూర్య, జ్యోతిక , కిరణ్ అబ్బవరం దంపతులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సూర్య, జ్యోతిక, కిరణ్ అబ్బవరం, నిర్మాత బి.వెంకటేష్ తదితరులు ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటుచేశారు. దర్శనానంతరం శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

తల్లి పాలు శిశువుకు అమృతం



మాట్లాడుతున్న డాక్టర్ ఉమాదేవి



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్, వైద్యులు, సిబ్బంది

తిరుపతి రూరల్: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. డి. ఉమాదేవి అన్నారు. మండలంలోని పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో స్వయం సహాయక సంఘ మహిళలు, బాలింతలకు సోమవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, అంగన్‌వాడీ టీచర్ ప్రభ, ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

తిరుపతి తుడా: అప్పుడే జన్మించిన శిశువులకు తల్లి పాలు పట్టించడం ఇటు తల్లికీ, అటూ బిడ్డకు ఆరోగ్యకరమని, అవి అమృతంలాంటివని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లో పీడియాట్రిక్స్, గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ, తల్లిపాల నుంచే బిడ్డకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని, దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ పునీత్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవళిక సుధారాణి, వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అవయవదాన దినోత్సవం

స్విమ్స్ పద్మావతి ఆడిటోరియంలో సోమవారం అవయవదాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడారు. మరణించినా మరికొందరిలో జీవించే భాగ్యం కేవలం అవయవదానం వలనే సాధ్యమన్నారు. అవయవదానంపై అపోహలు వీడి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

సామాజిక ఔన్నత్యాన్ని పెంచడమే భాషోత్సవ లక్ష్యం



శోభాయాత్రలో అతిథులు, పలు వర్సిటీల వీసీలు

తిరుపతి సిటీ: సామాజిక ఔన్నత్యాన్ని పెంచడమే భాషోత్సవ జాతీయ సదస్సు లక్ష్యమని వక్తలు ఉద్ఘాటించారు. జాతీయ సంస్కృత వర్సిటీలో ఏర్పాటు చేసిన అక్షర పురుషోత్తమ మండపం నుంచి జాతీయ సదస్సు ప్రాంగణం వరకు అతిథులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వర్సిటీలో మూడు రోజుల భాషోత్సవ సదస్సు రెండవ రోజు చెలికాని అన్నారావు మందిరంలో ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రస్థాన త్రయ భాష్యంపై మాట్లాడారు. ఢిల్లీకి చెందిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ్ అధ్యక్షులు సాధు భద్రేశ దాస్ స్వామి, యూజీసీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఢిల్లీ లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ సదస్సులో ప్రసంగించారు. సంస్కృత భాషతో పాటు ఇతర భాషలలోని ప్రస్థాన త్రయం గొప్పదనాన్ని వివరించారు. సదస్సులో ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, గుజరాత్‌లోని సోమనాథ్ సంస్కృత వర్సిటీ వీసీ సుఖాంత్ కుమార్ సేనాపతి, ప్రొఫెసర్ సచ్చిదానంద మిశ్రా, విశ్రాంత వీసీ హరేకృష్ణ శతపతి, ఉత్కల పీఠం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి 5వేల డజన్ల గాజులు.!



గాజులతో పాటు కంకణాలు, పసుపు-కుంకుమ ప్యాకెట్లను అధికారులకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి భక్తులు 5వేల డజన్ల గాజులను సోమవారం సమర్పించారు. తిరుచానూరుకు చెందిన సివిల్ ఇంజనీర్ షర్మిల, షణ్ముగం దంపతులు ఈ గాజులతో పాటు 10వేల కంకణాలు, 10వేల పసుపు-కుంకుమ ప్యాకెట్లను ఆలయ ఏఈఓ దేవరాజులకు అందజేశారు. వాటిని వరలక్ష్మీ వ్రతానికి హాజరయ్యే భక్తులతో పాటు అమ్మవారి దర్శనార్థం వచ్చే వారికి అందజేయాలని వారు కోరారు. ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల భవితతో చెలగాటం



మాట్లాడుతున్న ఉదయ్‌వంశీ

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్‌వంశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్ల మంజూరులో యూనివర్సిటీలు, ప్రైవేటు కళాశాలల వ్యవహారం ఇష్టారాజ్యంగా ఉందని, వాటిని నియంత్రించాల్సిన ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏమాత్రం కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి లోకేష్ అలసత్వం కారణంగానే విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సమావేశంలో యువజన విభాగం నేతలు మల్లం రవికుమార్‌రెడ్డి, పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.

'ఆప్కాస్' రద్దు సరికాదు



మాట్లాడుతున్న నారపరెడ్డి రాజారెడ్డి

తిరుపతి కల్చరల్: ఔట్ సోర్సింగ్ కార్మికుల కోసం గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కాస్)ను రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం యోచించడం సరికాదని వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సప్తగిరినగర్‌లో వైఎస్సార్‌టీయూసీ నగర ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు పూర్తి జీతం అందించాలనే సదుద్దేశంతో ఆప్కాస్‌ను తీసుకువచ్చారని తెలిపారు. కార్మికుల పొట్టకొట్టేందుకే చంద్రబాబు ఆప్కాస్ రద్దుకు చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. టీటీడీలో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ లక్ష్మీశ్రీనివాస కార్పొరేషన్‌లో చేర్చి జీతం రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. నేతలు తిరుమలరెడ్డి, షేక్ మహమ్మద్ రఫీ, ఎస్.రాజా, ఏ.యుగంధర్, గురుసాయి, నితిన్, జగదీష్, చక్రి,దయాసాగర్ పాల్గొన్నారు.

హెడేరా హాష్‌గ్రాఫ్ కోర్సుపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంట్యూటీవ్ డేటా సొల్యూషన్స్, హెడేరా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు హెడేరా హాష్‌గ్రాఫ్ కోర్సుపై మూడు రోజుల ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ సోమవారం వర్క్‌షాపును ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. భవిష్యత్తు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, పటిష్టమైన డీసెంట్రలైజ్డ్ అప్లికేషన్‌పై విద్యార్థులకు ఈ వర్క్‌షాపుతో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విభాగాధిపతి డాక్టర్ ఏ.మల్లీశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

కల్యాణం..కమనీయం



రామచంద్రాపురం: మండలంలోని యన్ఆర్.కమ్మపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో సోమవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి ఆచారి తొలుత గ్రామంలోని కర్నాల బావి నుంచి నీటిని, వాయిద్య మేళాలతో తీసుకొచ్చి, అభిషేకం చేసి, శాస్త్రోక్తంగా భక్తజన సందడి నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. మహిళలకు రవిక, పసుపు, కుంకుమ లాంఛనాలుగా ఇచ్చి ఆశీర్వదించారు.

పీజీసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడో..?

తిరుపతి సిటీ: పీజీసెట్ ఫలితాలు విడుదలై నెలలు గడుస్తున్నా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించకపోవడం శోచనీయమని ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎస్వీయూలోని పీజీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు కలసి కౌన్సిలింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి చిన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో- కన్వీనర్ అశోక్ కుమార్ ప్రభుత్వ వర్సిటీలలో ప్రవేశాలు చేపట్టడంలో ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి అధికారులు విఫలమయ్యారని విమర్శించారు.

పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నృత్య పోటీలకు కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు తిరుపతిలో శ్రీకృష్ణదేవరాయ స్వర్ణోత్సవ నృత్య కళోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనదలచిన కళాకారులు మరిన్ని వివరాలకు 9347046608ను సంప్రదించి 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.